بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّى عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

**Summary of Friday Sermon Huzur-e-Anwar 19.02.2016 (Telugu)**

**ముస్లిహ్ మౌవూద్ భవిష్యవాణి కేవలం ముస్లిహ్ మౌవూద్ భవిష్యవాణి మాత్రమే కాదు. అదొక గొప్ప ఆకాశ చిహ్నము. దయామయుడు, కరుణామయుడైన మన ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం సత్యము, వైభవమును బహిర్గత పరచుటకు అల్లాహ్ ఆలా దానిని చూపెను.**

*హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 19.02.2016 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

20 ఫిబ్రవరి రోజు అహ్మదియ్య జమాఅత్‌లో ముస్లిహ్ మౌవూద్ భవిష్యవాణిగా గుర్తించబడును. ధర్మ సేవకుడై, సుదీర్ఘ ఆయువు పొందు, వివిధ విశిష్టతలు గల ఒక కుమారుడు తమకు జన్మించునని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు శుభవార్త అందించబడెను. ఈ భవిష్యవాణి ప్రాముఖ్యత గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ముస్లిహ్ మౌవూద్ భవిష్యవాణి కేవలం ముస్లిహ్ మౌవూద్ భవిష్యవాణి మాత్రమే కాదు. అదొక గొప్ప ఆకాశ చిహ్నము. దయామయుడు, కరుణామయుడైన మన ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం సత్యము, వైభవమును బహిర్గత పరచుటకు అల్లాహ్ ఆలా దానిని చూపెను. వాస్తవానికి ఈ చిహ్నము ఒక మృతున్ని జీవింపజేసే కంటే వంద రెట్లు గొప్ప, ఉత్తమ, సంపూర్ణ, ఉన్నత, పరిపూర్ణమైనది. ఎందుకనగా అల్లాహ్ తఆలా ఆస్థానములో దుఆ చేసి ఒక ఆత్మను తిరిగి రప్పించటయే మృతున్ని జీవింపజేయుట. కాని ఇక్కడ అల్లాహ్ తఆలా తన దయతో హజ్రత్ ఖాతముల్ అన్బియా సల్లల్లాహు అలైహి వసల్లం శుభముతో అల్లాహ్ తఆలా నా దుఆను ఆమోదించి ఒక ఆత్మను పంపుటకు వాగ్దానము చేసెను. దాని బాహ్యాంతర శుభములు మొత్తం ప్రపంచములో వ్యాపించును. నిజముగా ఈ చిహ్నము మృతులను జీవింపచేయునట్లే కనిపించును. కాని గమనించినచో మృతులను జీవింపచేయడం కంటే ఈ సంకేతము ఎన్నో రెట్లు ఉత్తమమైనది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఈ భవిష్యవాణి చాలా గొప్పగా పూర్తి అయినట్లు స్వపక్షం, ప్రతిపక్షం అందరు చూసినారు. ఈ భవిష్యవాణి హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) గురించే యుండెనని కాలము నిరూపించెనని జమాఅత్ విద్యావంతులు, జమాఅత్ సభ్యులు నమ్మేవారు. కాని ఈ భవిష్యవాణి నా గురించేనని హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని స్వయముగా ఎన్నడు వ్యక్తపరచలేదు, ప్రకటించలేదు. తుదకు వారు ఖలీఫా అయి 30 సం॥లు గడిచినవి. చివరికి నేను ముస్లిహ్ మౌవూద్‌నని 1944లో వారు ప్రకటించిరి.

దీని గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) గారి రెండు ఖుత్బాల నుండి వారి పదములలోనే కొన్ని విషయాలు ప్రస్తావింతునని హుజూరె అన్వర్ అనిరి. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) తమ ఖుత్బా 28 జనవరి 1944లో ఇట్లు తెలిపిరి. నా స్వభావమునకు భారమైన విషయమును నేడు నేను ప్రస్తావించదలచితిని. కాని కొన్ని ప్రవక్తృత్వములు, దైవ నిర్ణయములు ఈ విషయమును ప్రకటించుటతో ముడిపడియున్నందున నా స్వభావమునకు నచ్చకున్నను ప్రకటించకట యుండలేను. అనంతరం వారు తమ ఒక సుదీర్ఘ దివ్యస్వప్నమును తెలుపుచు ఇట్లనిరి. ముస్లిహ్ మౌవూద్ గురించి గల భవిష్యవాణిని అల్లాహ్ తఆలా నా గురించే నిర్ణయించియున్నాడు. ఈ భవిష్యవాణీల గురించి మీ అభిప్రాయము ఏమిటని ప్రజలు అడిగినారు, పదే పదే అడిగినారు. కాని నా పరిస్థితి ఎట్లుండెననగా నా మనసు నన్ను మోసము చేయకూడదని, వాస్తవానికి విరుద్ధమైన విషయము నా గురించి నేను ఆలోచించకూడదని ఆయా భవిష్యవాణీలను చదువుటకు ప్రత్యేక శ్రద్ధతో ఎన్నడు ప్రయత్నించలేదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నిజమైనవారు ఇంత జాగ్రత్త పడుచున్నారు. కాని అవివేకులు ఎలాంటి సంకేతము లేకుండానే దీనిని ప్రకటించుచున్నారు. వీరిని పిచ్చివారనక మరేమి అనగలము. ఈ భవిష్యవాణి గురించి తమ మొహమాటమును ఒక చోట ప్రస్తావించుచు ఇట్లనిరి. హజ్రత్ ఖలీఫా అవ్వల్ (రజి) నాకొక సారి ఉత్తరము వ్రాసిరి. మీ పుట్టుక గురించి ఈ ఉత్తరము హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నాకు వ్రాసిరి. దీనిని తష్హీజుల్ అజ్హాన్ (పత్రిక)

లో ప్రచురించుము. నేను హజ్రత్ ఖలీఫా అవ్వల్ (రజి) గౌరవములో దానిని ప్రచురించితిని. కాని అప్పుడు కూడ నేను దానిని శ్రద్ధతో చదవలేదు. ప్రజలు అప్పుడు కూడ అనేక విషయములు మాట్లాడినారు. ఉత్తరము ప్రచురించిన తరువాత నేను మౌనము దాల్చినాను. ఈ భవిష్యవాణీలు ఎవరు గురించి గలవో అతడు ప్రకటించవలసిన అవసరం లేదని నేను భావించేవాడిని. ప్రజలు అనేక భవిష్యవాణీలను నా ముందు యుంచి మీరిందుకు ప్రతిరూపమని పట్టుబట్టిరి. భవిష్యవాణీలు తమ ప్రతిరూపమును తామే ప్రకటించునని నేను చెప్పేవాడిని. ఈ భవిష్యవాణీలు నా గురించే యున్నచో ఆ కాలము స్వయముగా బహిర్గతపరచును. నా గురించి కానిచో కాలము నాకు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చును. రెండు పరిస్థితులలోను నేనేమి చెప్పవలసిన అవసరం లేదు. తొందరపాటు నాకు అవసరం లేదు. దేవుడు స్వయముగా బహిర్గతపరచును. దైవవాణిలో చెప్పినట్లు వచ్చేవారు వీరేనా లేక మేము మరొకరి రాకకు నిరీక్షించమా. అవి దైవవాణి వాక్యములు. ప్రపంచము దీనిపై ఎన్నో సార్లు ప్రశ్నించెను. తుదకు ఒక సుదీర్ఘ కాలము గడిచినది. ఈ సుదీర్ఘ కాలము గురించి కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) భవిష్యవాణీలు గలవు. ఉదా॥ హజ్రత్ యాకూబ్ (అ) గురించి హజ్రత్ యూసుఫ్ (అ) సోదరులు ఇట్లనిరి. నీవు ఇలాగే యూసుఫ్ గురించి మాట్లాడెదవు. (యాకూబ్ (అ)తో ఇట్లనిరి) తుదకు నీవు మరణమునకు చేరువగుదువు లేదా మరణింతువు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఇదే దివ్యవాణి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నకు కూడ అందెను. యూసుఫ్ సువాసన నాకు వచ్చుచున్నదని వారికి దైవవాణి కూడ అందెను. వారు ఒక పద్యములో కూడ దీనిని ప్రస్తావించిరి. ఒక సుదీర్ఘ కాలము తరువాత దైవ అభీష్టము మేరకు ఇది ప్రత్యక్షమగునని ఇది తెలుపుచున్నది. ఎందుకనగా హజ్రత్ యూసుఫ్ కూడ తమ తండ్రికి ఒక సుదీర్ఘ కాలము తరువాత కలిసిరి లేదా ఆ భవిష్యవాణి పూర్తి అయ్యెను. ఈ భవిష్యవాణీలు నా గురించేనని మరణము వరకు కూడ నాపై బహిర్గతము కాకున్నను సంఘటనలు నా హస్తమున, నా కాలమున పూర్తి అయినవి, ఇవి నా గురించే అని స్వయముగా ఈ భవిష్యవాణీలు తెలుపును.

కాని అల్లాహ్ తఆలా తన అభీష్టము మేరకు ఈ విషయమును బహిర్గత పరచెను. ముస్లిహ్ మౌవూద్ గురించి గల భవిష్యవాణీలు నా గురించేనని నాకు తెలిపెను.

కొన్ని భవిష్యవాణీలను సంక్షిప్తముగా వారు ప్రస్తావించినారు. ఉదా॥ "అతడు మూడును నాలుగు చేయును" ఇదే విధముగా 'సోమవారము, శుభప్రద సోమవారము'. ఈ రెండు విషయములను వారిట్లు వివరించిరి. మూడును నాలుగు చేయునను భవిష్యవాణి గురించి ముగ్గురు కుమారులను నలుగురు కుమారులుగా చేయునని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం భావించిరి. కాని అల్లాహ్ తఆలా నా ఆలోచనను ఇటు కూడ మరల్చెను. దైవవాణిలో అతడు ముగ్గురు కుమారులను నలుగురుగా చేయునని భవిష్యవాణిలో లేదు. దైవవాణిలో కేవలం మూడును నాలుగు చేయునని మాత్రమే యున్నది. నా దృష్టిలో ఇందులో అతని జనన తేదీ తెలుపబడెను. ఈ ముస్లిహ్ మౌవూద్ భవిష్యవాణి 1886 సం॥ ఆరంభములో అందెను. నేను 1889లో జన్మించినాను. కనుక మూడును నాలుగు చేయునను భవిష్యవాణిలో అతను నాలుగవ సం॥లో జన్మించునని వార్త అందించబడెను. ఇలాగే జరిగెను. సోమవారము శుభప్రదమైన సోమవారము అని చెప్పిన దానికి మరో అర్థము ఇట్లు కూడ కాగలదు. నా దృష్టిలో దీని ఒక స్పష్టమైన వివరణ ఏమనగా సోమవారము వారములోని మూడవ రోజు అగును. రెండవ వైపు ప్రవక్తల, వారి ఉత్తరాధికారుల కాలము విడి విడిగా యుండును. ఈ కోణంలో గ్రహించి చూడుము. మొదటి కాలము హజ్రత్ మసీహ్ మౌవూద్ కాలము. రెండవ కాలము హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ (రజి) కాలము. మూడవ కాలము నాది. మరో దైవవాణి కూడ దీనిని సమర్థించును. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)నకు 'ఫజ్లె ఉమర్' అను మరో దైవవాణి అందెను. హజ్రత్ ఉమర్ (రజి) కూడ రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం నుండి మూడవ స్థానములో ఖలీఫాగా యుండిరి. కనుక సోమవారము, శుభప్రదమైన సోమవారము అనగా ఆ వాగ్దత్త ఉదాహరణ జమాఅత్ కాలములో సోమవారమునకు యున్నట్లుండును. అనగా ఈ సంస్థలో ధర్మ సేవ కొరకు అల్లాహ్ తఆలా తరపున నిలుపబడిన వారిలో అతడు మూడవ స్థానంలో యుండును. ఫజ్లె ఉమర్ దైవవాణి నామములో కూడ ఇదే సంజ్ఞ గలదు. ఈ విధముగా దైవ వాక్యములోని يفسره بعضه بعضا కొన్ని వాక్యములు మరో వాక్యములను విశదీకరించును ప్రకారము ఫజ్లె ఉమర్ పదము సోమవారము పవిత్ర సోమవారమును విశదీకరించెను. కాని ఇస్లాంలో మరో వార్త కూడ యున్నది. అల్లాహ్ తఆలా సోమవారము శుభప్రదమైన సోమవారమును మరో విధముగా కూడ తీసుకొచ్చును. వారిట్లనిరి. ఇది నా వశములో లేకుండెను, నేను ఉద్దేశపూర్వకంగా దీనిని ప్రారంభించినానని ఎవరు అనలేరు. అనగా తహ్రీకె జదీద్ ప్రారంభోత్సవము. ప్రభుత్వ ఒక అడుగు అనగా జమాఅత్‌నకు వ్యతిరేకంగా కొన్ని కఠిన చర్యలు తీసుకునే ప్రణాళికలు రచించిన స్థితులలో 1934 సం॥లో ప్రారంభించబడెను. ఈ ఉద్యమ ఆలోచనను

అల్లాహ్ తఆలా నా హృదయములో వేసెను. ఈ ఉద్యమమునకు మొదటి విడతగా నేను పది స॥లు నిర్ణయించితిని. ప్రతి మానవుడు త్యాగము చేయును, త్యాగము చేసిన తరువాత అతనిపై పండుగ రోజు వచ్చును. ఉదా॥ రమజాన్ ఉపవాసముల తరువాత పండుగ రోజు వచ్చును. ఇదే విధముగా వారిట్లనిరి. 1945 సం॥ను ఈ కోణంలో చూసినచో తహ్రీకె జదీద్ మొదటి పది స॥ల తరువాత 11వ సం॥ పండుగ సం॥ అగును. ఈ సం॥ సోమవారము నుండి ప్రారంభమగును. సోమవారము దోషంబ అనబడును. అల్లాహ్ తఆలా ఈ పదములలో ఇట్లు వార్తనందించెను. ఒక కాలములో ఇస్లాం అతి బలహీన స్థితిలో దాని ప్రచారము కొరకు ఒక అతి ముఖ్యమైన ప్రచార సంస్థకు పునాది వేయబడును. దాని మొదటి విడత విజయవంతముగా పూర్తి అయినప్పుడు అది జమాఅత్ కొరకు శుభప్రదమైన సమయమయ్యెను.

హుజూర్ ఇట్లనిరి. సుదీర్ఘ దైవస్వప్నము తరువాత తాను ముస్లిహ్ మౌవూద్‌నని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ప్రకటించిరి. దాని గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఈ దివ్యస్వప్నములో అల్లాహ్ తఆలా నా నలుకతో انا المسیح الموعود مثیله وخلیفته అను పదములను పలికించెను. ఈ విచిత్ర పదములు నా నాలుకతో ఎందుకు వెలువడినవని స్వప్నములోనే ఆశ్చర్యము కలిగెను. ఈ దైవవాణి వినిన తరువాత కొందరు ఇట్లు తెలిపిరి. మసీహ్ ఆత్మ అగునను ప్రస్తావన హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కరపత్రము 20 ఫిబ్రవరి 1886లో గలదు. కరపత్రములో ఈ పదములున్నవి. అతడు ప్రపంచములో అడుగిడును. తన మసీహ్ ఆత్మతో, సత్యమైన ఆత్మ శుభముతో అనేకులను వ్యాధుల నుండి పవిత్రము చేయును. దైవ ఏకత్వమును సత్యమైన ఆత్మ అందురు. వారు ఇస్లాం ప్రచారమునకు పునాది వేసి ప్రపంచ హృదయములను అన్యారాధనతో పవిత్రము చేసిరి. నేను దివ్యస్వప్నములో చూసిన మూడవ విషయమేమనగా నేను పరుగెత్తుచున్నాను, నేను వేగంగా పరుగెత్తడమే కాక భూమి నా పాదముల క్రింద కుచించిపోవుచున్నది.

వాగ్దత్త కుమారుని భవిష్యవాణిలో అతడు త్వర త్వరగా పెరుగునని యున్నది. నేను స్వప్నములో ఇట్లు చూసినాను. నేను కొన్ని విదేశాలకు వెళ్లినాను. అక్కడ మేము మా కార్యమును ముగించలేదు. అక్కడికి వెళ్లి కూడ నేను నా కర్యమును ముగించలేదు. ఇంకా ముందుకు వెళ్లడానికి సంకల్పించుచున్నాను. నేను స్వప్నములో ఇట్లన్నాను. ఓ అబ్దె షకూర్ ! ఇంకా నేను ముందుకు వెళ్లెదను. ప్రయాణము నుండి తిరిగి వచ్చిన తరువాత నీవు దైవ ఏకత్వమును స్థాపించినావా? అన్యారాధనను అంతము చేసినావా ? హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బోధనను దృఢపరచినావా నేను చూచెదను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు అవతరించిన దైవవాణిలో ఇటు వైపు సంజ్ఞ గలదు. అనగా అతడు భూ అంచుల వరకు ఖ్యాతి చెందును. అనగా ప్రచార కార్యములను ముందుకు కొనసాగించును. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) కాలములో ఈ భవిష్యవాణి కూడ అతి గొప్పగా పూర్లి అయినట్లు మనము చూచినాము. ఇదే విధముగా ముస్లిహ్ మౌవూద్ భవిష్యవాణిలో గల, చాలా విషయములను పోలిన విషయములు ఈ సుదీర్ఘ స్వప్నములో వారికి చూపబడినవి.

హుజూర్ ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సూచనతో భవిష్యవాణితో పోలిన కొన్ని విషయములను హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ప్రస్తావించిరి. వారి కాలము నుండి ఇప్పటి వరకు ఈ భవిష్యవాణిని పూర్తి చేసిన విషయములు, ఎలా పూర్తి అయినదో సంక్షిప్తముగా ప్రస్తావింతును. వారొక సంఘటన తెలిపిరి. ఒక సారి నేను నమాజ్ నిరీక్షణలో హజ్రత్ అమ్మాజాన్ (రజి) గదిలో తిరుగుచుండగా మస్జిద్ నుండి నాకు గట్టి గట్టిగా మాటలు వినిపించినవి. ఒక బాలున్ని ముందట నిలబెట్టి జమాఅత్‌ను నాశనం చేసినారని అంటుండిరి. అతడు త్వర త్వరగా పెరుగునను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) దైవవాణిని వ్యతిరేకుల ఈ మాట బలపరచుచున్నది. దేవుడు నన్ను ఎంత త్వరగా పెంచినాడనగా శత్రువు ఆశ్చర్యచకితుడైనాడు. కొన్ని నెలల ముందు నన్ను బాలుడు అనేవారు కొన్ని నెలల తరువాత నన్ను ఒక అతి తెలివైన అనుభవజ్ఞుడని దూషించడం మొదలు పెట్టిరి. పూర్తిగా విరుద్ధమైరి. అనగా బాల్యములోనే అల్లాహ్ తఆలా నా చేతులతో సంస్థలో పీడనమునకు పాల్పడిన వారిని ఓడించెను. ఆ రోజు పోయినది, ఈ రోజు వచ్చినది. జామఅత్ నాకు అప్పగించినప్పుడు జమాఅత్ సంఖ్య ఎంత యున్నదో అందరికి తెలుసు. నేడు అల్లాహ్ తఆలా దయతో వందలాది రెట్లు అధికముగా యున్నది. ఏ ఏ దేశములలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నామము చేరియుండెనో అంత కంటే ఎన్నో రెట్లు అధిక దేశములలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నామము నేడు చేరినది. అతడు త్వర త్వరగా పెరుగను, దేవుని నీడ అతనిపై యుండునను అల్లాహ్ తఆలా వాక్యము, ఆ భవిష్యవాణి చాలా గొప్పగా పూర్తి అయినది. బద్ధ శత్రువు కూడ దీనిని నిరాకరించలేదు.

నేను ఆరంభములో పంక్తులను తెలిపినట్లు ఇది కేవలం భవిష్యవాణి కాదు, చాలా గొప్ప భవిష్యవాణి అని

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ భవిష్యవాణిని చాలా ముఖ్యమైనదిగా భావించిరి. ఈ భవిష్యవాణి ప్రకారము బాలుడు 9 సం॥లలోపు జన్మించవలసి యుండెను. 9 సం॥ల వరకు తాను జీవింతుననే నమ్మకము లేదని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అనిరి. ఈ కాలములో బాలుడు జన్మించడం ప్రక్కకు పెట్టినా సంతానము కలుగునని పూర్తి నమ్మకముతో చెప్పలేము. కేవలం బాలుడు మాత్రమే జన్మించడం కాదు, ఇస్లాం గొప్పతనము, వైభవమునకు కూడ ఆ బాలుడు కారణమగునని భవిష్యవాణి అందెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)పై శత్రువు నలు వైపుల నుండి దాడులు చేసిన ఆ కాలమెలా యుండెను. ఎందుకనగా వారు దివ్యవాణిని ప్రకటించిరి. నాకు దివ్యవాణి అందుచున్నదని అనిరి. సంస్కర్త ప్రకటన, అవతార పురుషుని ప్రకటన చేయలేదు. అప్పుడు గొప్ప లక్షణములతో కూడిన ఒక బాలుని భవిష్యవాణి వారు చేసిరి. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఒకరి నాయిబ్ ఖ్యాతి చెందినచో అతని అధికారి ఖ్యాతి అగును. అల్లాహ్ తఆలా భవిష్యవాణిలో అతడు భూ అంచుల వరకు ఖ్యాతి చెందునని అన్నప్పుడు అతని ద్వారా హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నామము కూడ భూ అంచుల వరకు చేరునని దీని అర్థము. భవిష్యవాణి ఎంత స్పష్టముగా యున్నదో చూడుము. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కాలంలో ఒక ప్రాముఖ్యతతో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నామము అఫ్ఘానిస్తాన్‌లో చేరెను. ఇతర దేశములలో కేవలం నామమాత్రముగనే వార్తలందెను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ను అల్లాహ్ తఆలా ఖలీఫాగా చేసినప్పుడు అల్లాహ్ తఆలా దయతో స్మాట్రా, జావా, స్ట్రీట్ సెటెల్మెంట్, చైనా, మారిషస్, ఆఫ్రికా ఇతర దేశములు, ఈజిప్టు, పాలస్తీనా, ఈరాన్, ఇతర అరబ్ దేశములకు, యూరప్‌లోని చాలా దేశములలో అహ్మదియ్య సంస్థ వ్యాపించినదని వారు తెలపిరి.

అతడు బాహ్యాంతర విద్యలతో పరిపూర్ణుడగునని ఈ భవిష్యవాణిలో తెలుపబడెను. వారి భవిష్యవాణి ప్రకారము ఈ కాలములో బాహ్యాంతర విద్యలతో పరిపూర్ణుడైన, దైవ ఆత్మ కలిగిన ఒక వ్యక్తిని తన వాక్యముతో సత్కరించదలచెను. అతడు మజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వివరణ ప్రకారము, రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచించిన వివరణ, పవిత్ర ఖుర్ఆన్ అభీష్టము మేరకు శత్రువుల సామాజిక దాడులను దూరము చేసి, ఇస్లాం రక్షణ కార్యమును పూర్తి చేయవలసియుండెను. కనుక అల్లాహ్ తఆలా తన పనిని పూర్తి చేసెను. నా రచలను తన ముద్రతో సమర్థించెను. దేవుడు నాకు చెప్పనంత వరకు నేను మౌనముగా యుంటిని. చెప్పడమే కాక ప్రజలకు కూడ చెప్పమని ఆజ్ఞాపించెను. అందుకే ఈ బవిష్యవాణి అన్ని విధాలా నాపై పూర్తి అయినదని చెప్పుచున్నాను. చెప్పమని అల్లాహ్ తఆలా నన్ను ఆదేశించడమే కాక తన దయతో ఈ బవిష్యవాణి సత్యమునకు నిదర్శనముగా పరిస్థితులను కల్పించెను. ఆకాశములో చంద్రుడు ప్రకాశించినట్లే అల్లాహ్ తఆలా అతని చుట్టు నక్షత్రములను సృష్టించెను. ఈ రోజులలో చాలా మందికి వచ్చిన స్వప్నములలో ఈ స్వప్నములోని అంశము చూపబడెను. అనంతరం వారు పలు విధేయుల స్వప్నములు, తమ స్వప్నములు, భవిష్యవాణీలను తన సమర్థనకు తెలిపిరి.

అల్లాహ్ తఆలా ఈ కాలములో కూడ అందరి విశ్వాసమును రక్షించును గాక! ప్రతి అహ్మదీ విశ్వాసమును రక్షించును గాక! అవిశ్వాసము, నిరాకరణ దృకపథము నుండి సదా రక్షించుగాక! హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) విద్య, విజ్ఞానము నుండి ప్రయోజనము పొందుటకు అనుగ్రహము జమాఅత్ సభ్యులను అల్లాహ్ తఆలా అధికాధికముగా అనుగ్రహించుగాక! ఉర్దులో కూడ గలదు, ఇతర భాషలలో కూడ కొంత లిటరేచర్ యున్నది. దానిని చదవవలెను. అల్లాహ్ తఆలా అందరిని అనుగ్రహించుగాక! (ఆమీన్)

చివరలో గౌ॥ సూఫీ నజీర్ అహ్మద్ తండ్రి కీ.శే. గౌ॥ మియాం ముహమ్మద్ అబ్దుల్లాహ్ మరణ వార్త తెలిపి వారి సద్గుణములను హుజూరె అన్వర్ ప్రస్తావించిరి. జుమా నమాజ్ తరువాత వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించిరి.

BOOK POST (PRINTED MATTER)

To,

..............................................................................

..............................................................................

..............................................................................